ప్రజాశక్తి
శుక్రవారం 4 ఆగస్టు 2023
5
పార్వతీపురం మన్యం

7న మున్సిపల్ కార్మికుల చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - పాలకొండ

మున్సిపల్ ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈనెల 7న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తీవ్రతం చేస్తామని అన్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రికల్, వాటర్ సెక్షన్, ఇంజనీరింగ్ విభాగం తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మణిపూర్‌లో ఆదివాసీలపై దాడిని నిరసిస్తూ....

ఏజెన్సీ బంద్ జయప్రదం

- మూతపడ్డ దుకాణాలు
- పలుచోట్ల నిరసన ప్రదర్శనలు

గుమ్మలక్ష్మీపురంలో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

సీతంపేటలో మూతపడిన దుకాణాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మణిపూర్ ఆదివాసీలపై కార్పొరేట్, మతోన్మాద శక్తుల పైశాచిక మారణహెూమాన్ని ఆపాలని ఆదివాసి గిరిజన సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఏజెన్సీ బంద్ పార్వతీపురం మన్యం జిల్లాలో విజయవంతమైంది. ఇందులో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో బంద్ ప్రభావంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట గ్రామాల్లో వర్తక, వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు మూతపడ్డాయి. ఆటోలు, ట్రక్కర్ల యజమానులు, రిక్షా కార్మికులు బంద్‌కు సహకరించారు. ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ఎల్విన్ పేట నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో మణిపూర్‌లో కుకి, నాగ గిరిజన జాతులపై గిరిజనేతరులైన మైతీలతో దాడులు చేయిస్తూ మారణ హెూమం సృష్టిస్తుందని అన్నారు. మరోవైపు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ బాక్సైట్ తవ్వకాలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తుందన్నారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలకు రక్షణ లేకుండా చేస్తుందని అన్నారు. మణిపూర్‌లో ఆదివాసీలపై కార్పొరేట్, మతోన్మాద శక్తుల మారణ హెూమం ఆపాలని, ఆ రాష్ట్ర సిఎం బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని రద్దు చేయాలని, గ్రామ సభలకు అధికారాలివ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులను అడవి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం కోసమే నూతన అటవీ సంరక్షణ చట్టం తీసుకువచ్చిందన్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జిఒ 3కు చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలని, నాన్ షెడ్యూల్డ్ ఏరియా గ్రామాలను ఐదో షెడ్యూల్డ్ ఏరియాలో కలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం కోశాధికారి మండంగి రమణ, మండల నాయకులు పువ్వల మోహన్ రావు,సన్యాసిరావు, బిడ్డిక ఆడిత్, బిడ్డిక శంకర్రావు తదితరులు ఉన్నారు.

సీతంపేట : మణిపూర్ ఆదివాసీలపై మారణ హెూమం ఆపాలని తలపెట్టిన మన్యం బంద్ మండలంలో విజయవంతమైంది. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బందు ఏకధాటిగా కొనసాగింది. గిరిజన సంఘం నాయకులు దోనుబాయి జంక్షన్ నుండి సంత మార్కెట్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సీతంపేటలో షాపులు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ బంద్‌కు ప్రజలు సహకరించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, మండల నాయకులు బి.సాయి, శ్రీరాములు, సాంబయ్య, భాస్కరరావు, గంగాధర్ పెద్దఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.

బెలగాం : మణిపూర్‌లో మారణహోమం ఆపాలని గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, డి.సీతారాం ఆధ్వర్యంలో పెద్దఎత్తున మహిళలు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గిరిజన మహిళల అత్యాచారానికి, హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

కురుపాం : మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులకు బాధ్యత వహిస్తూ మణిపూర్ సిఎం వెంటనే రాజీనామా చేసి మారణహెూమం ఆపాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక రావాడ జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోలక లక్షణామూర్తి, గిరిజన సంఘం జిల్లా సలహాదారుడు బి.కూర్మారావు,గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.తిరుపతిరావు, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పల్ల సురేష్, గిరిజన సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.

పాచిపెంట : ఎపి ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి జెన్ని రామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు, సూకురు అప్పలస్వామి, ఆదివాసీ గిరిజన ఐక్యవేదిక జిల్లా నాయకులు పడాల తమ్మయ్య ఆధ్వర్యంలో మన్యం బంద్ మండల కేంద్రమైన పాచిపెంటలో ప్రశాంతంగా జరిగింది. ఈ బంద్‌కు ప్రజలంతా సంఘీభావం తెలిపారు. విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగానే మూసివేసి సంఘీభావం తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొర్ర అర్జున్, పాముల సన్యాసి, సుయ్యారి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : గిరిజన సంఘం రాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చిన మన్యం బంద్ మండల కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. గురువారం మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొమరాడ మెయిన్ రోడ్డు వద్ద భారీగా ర్యాలీ అనంతరం నిరసన మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈమరక రామారావు, ఊయిక వెంకటేష్, ఊయిక రామస్వామి మాట్లాడారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గౌరునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివుని నాయుడు, బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. గిరిజన ప్రజలు మరియు జూనియర్ కాలేజ్ మరియు హైస్కూల్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని మామిడిపల్లిలో నిర్వహించిన బంద్ విజయంతమైంది. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వంతల సుందరరావు, గెమ్మెల జానకిరావు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు కూనేటి చినబాబు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

పాచిపెంట మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

సాలూరు మండలం మామిడిపల్లిలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

విమర్శలు చేస్తే సహించేది లేదు

- డిప్యూటీ సిఎం రాజన్నదొర
- విఆర్ఎస్ నీరు విడుదల

ప్రజాశక్తి - మక్కువ

సాగునీటి ప్రాజెక్టులపై చవట విమర్శలు చేస్తే సహించేది లేదని డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర టిడిపి నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఏ ప్రాజెక్టులు కూడా రెండో పంట సామర్థ్యానికి సరిపోవని, అధికారులు చెప్పినా పెద్దగెడ్డ రిజర్వాయర్ కింద భూములకు రెండో పంటకు నీరు విడుదల చేయలేదంటూ చేసిన విమర్శలపై ఆయన ఘాటుగా స్పందించారు. పెద్దగెడ్డపై మాకంటే ఆ పెద్దమనిషికి బాగా తెలుసునని, ఎందుకంటే ప్రధాన న్యాయపతిదారుడు కూడా ఆయనేనని పరోక్షంగా భంజ్‌దేవ్‌పై విరుచుకుపడ్డారు. గురువారం వెంగళరాయ సాగర్ నుంచి ఆయకట్టు భూములకు నీరు విడుదల చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి నేతలు విమర్శలు చేస్తున్నారని, సాలూరు నియోజకవర్గం అభివృద్ధికి సుమారు రూ.900 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. దీనిపై బహిరంగ చర్చకు సాలూరు నడిబొడ్డులో ఉన్న బోసు బొమ్మ సెంటర్‌కు రావాలని సవాల్ చేశారు. ఏ విధమైన ఆధారాల్లేకుండా విమర్శలు చేస్తే ఇకపై ఊరుకునేది లేదని, తాము కూడా అంతే ధీటుగా సమాధానం చెప్పక తప్పదని హెచ్చరించారు. సంధ్యారాణికి అవగాహన లేకపోతే సీనియర్ నాయకులు భంజ్‌దేవ్ కూడా ఆ రీతిలో వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఎస్.వెంకట చిన్నప్పలనాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కూడా వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టనుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.64 కోట్లు జపాన్ నుంచి నిధులు మంజూరయ్యాయని, 2025 నాటికి ఈ నిధుల ద్వారా పనులు పూర్తయితే ఆయకట్టుకు నీరు పుష్కలంగా అందే ఆస్కారం ఉందన్నారు. ప్రస్తుతం పనులు 20 శాతం అయ్యాయని ఇంజనీరింగ్ అధికారి తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు రంగు నాయుడు, సాలూరు, బొబ్బిలిమండలాలకు చెందిన వైసిపి నాయకులు, ఇంజనీరింగ్ అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

వెంగళరాయ సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

జ్వరాల బారి నుండి విద్యార్థులను రక్షించండి

- తక్షణమే వాటర్ ప్లాంట్ బాగు చేయాలి
- శాశ్వత వైద్య సిబ్బందిని నియమించాలి
- ఆదివాసీ గిరిజన సంఘం, వ్యకాస డిమాండ్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎర్ర సామంతవలస గిరిజన ఆశ్రమం పాఠశాల విద్యార్థులను జ్వరాల బారి నుండి కాపాడాలని తక్షణమే రక్షిత మంచినీటి పథకాన్ని బాగు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు తాడంగి ప్రభాకర్‌రావు, శ్రీధరపు బిరుసు, కొల్లి గంగనాయుడు ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించి జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ఆశ్రమం పాఠశాలలో చదువుతున్న బిడ్డిక మహేంద్ర చనిపోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికీ సీదరపు వరుణ్, మచ్చ దావీదు, మండంగి సంతోష్, చింత చిన్న, సీదరపు తేజ జ్వరంతో బాధపడుతూ మంచాలపై ఉన్నారని అన్నారు. వీరే కాకుండా మరి కొంతమందిని విద్యార్థులు దోకిశీల పిహెచ్‌సికి చికిత్స కోసం తీసుకెళ్లినట్టు విద్యార్థులు తెలిపారు. వీరే కాకుండా ప్రతిరోజు 10 మందికి తక్కువ కాకుండా జ్వరాల బారిన విద్యార్థులు పడుతున్నారన్నారు. అలాగే ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఎర్రసామంతవలసలో ఆశ్రమ పాఠశాలలో ఉన్న వాటర్ ప్లాంట్ సక్రమంగా పనిచేయడం లేదని ఆ నీరు తాగడం వల్ల టైఫాయిడ్ ,మలేరియా, జ్వరాలు బారిన పడుతున్నారని అన్నారు. అలాగే వంట చేయడానికి శాశ్వత ప్రాతిపదికన ఒక కుక్కు మాత్రమే ఉన్నారని మిగిలిన సిబ్బంది ఎవరూ లేరన్నారు. ప్రతి గిరిజన ఆశ్రమం పాఠశాలకు శాశ్వత ప్రాతిపదికన ఎఎన్ఎంను నియమించాలని, అన్ని రకాల మందులు సరఫరా చేయాలని, పిహెచ్‌సికి తీసుకెళ్లడానికి రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై శుక్రవారం ఐటిడిఎ పిఒ, డిప్యూటీ డిఎంహెచ్ఒకు వినతిని అందజేస్తామన్నారు. అలాగే మృతి చెందిన మహేందర్ కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు విద్యార్థి మహేందర్ కుటుంబాన్ని నంద గ్రామం వెళ్లి నాయకులు సందర్శించి వారిని ఓదార్చారు.

జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

క్విట్ ఇండియా స్ఫూర్తితో 9న ధర్నాలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 9న జిల్లా కేంద్రంలో జరుగు ధర్నాలు జయప్రదం చేయలని రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ ప్రజా సంఘాలు నాయకులు పిలుపనిచ్చారు. గురువారం ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు అధ్యక్షతన సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ ఈనెల 9న క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కార్మిక రైతాంగం విద్యార్థి, యువజన, మహిళలు వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 9న జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా ఉంటుందని, దీన్ని వివిధ ట్రేడ్ యూనియన్, ప్రజా సంఘాలు జయప్రదం చేయాలని కోరారు. 9ఏళ్ల మోడీ పరిపాలనలో కార్మికుల సమస్యలు పరిష్కారం చేయలేదని, స్కీం వర్కర్ల శ్రమను దోచుకుం టూ వారిని పర్మినెంట్ చేయడం లేదని విమర్శిం చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 900 రోజులుగా పోరాడుతున్నా మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకే కట్టుబడి ఉంటానని చెబుతోందన్నారు. అసంఘటిత కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ ఆరోగ్య సౌకర్యాలు, సామాజిక భద్రత పథకాన్ని ఇంతవరకు ప్రకటించలేదని, కాంట్రాక్ట్ వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న చట్టం చేయలేదని, కొత్త పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ స్కీం పునరుద్ధరిం చాలని, కనీసం ఇపిఎస్ పెన్షన్ రూ.9000 కు పెంచాలన్న కోరికతీర్చడం లేదని అన్నారు. మణిపూర్లో రెండు జాతుల మధ్య గొడవ పెట్టి గిరిజన మహిళ ఊరేగించడం అత్యంత దారుణ మైన చర్య ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఈనెల 9న బైక్ ర్యాలీ, వివిధ ప్రజా సంఘాలు, ప్రజలు, కార్మికులు, రైతులు పాల్గొనాలని జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశాలు మాట్లాడిన వివిధ ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, విఆర్ఎల సంఘ నాయకులు ఈశ్వరరావు, పాపారావు, సిఐటియు పట్టణ నాయకులు బి.సూరిబాబు, ఎస్.ఉమా, మున్సిపల్ కార్మికుల ఫెడరేషన్ నాయకులు ఎన్వై నాయుడు, శ్రామిక మహిళ నాయకులు వి.ఇందిర, శ్రీరామ్మూర్తి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

నేడు డిఇఒ కార్యాలయం వద్ద నిరసన : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి 2 నెలలు పూర్తి కావస్తున్నా, బదిలీలకు గురైన ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించక పోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్రావులు తెలిపారు. క్యాడర్ స్ట్రెంత్ అప్డేట్ చేస్తున్నామనే నెపంతో ఇంత వరకు జీతాలు చెల్లించక పోవడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. జీతాల మీదే ఆధారపడిన ఉపాధ్యాయులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

5న నిరసన, ప్రదర్శనలు

పార్వతీపురంరూరల్ : జూన్‌లో బదిలీలు అయిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు జూన్, జులై రెండు నెలల పెండింగ్ జీతాలు ఈనెల 4లోపు చెల్లించకుంటే 5న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు చేస్తామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు దుర్గారావు, బాలకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిఒ 47 ద్వారా బదిలీ అయిన వారు, రీఅపోర్షన్మెంట్ పోస్టుల్లో చేరిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్లస్-2లో చేరిన ఉపాధ్యాయులు, ఎంఇఒ-2 పోస్టుల్లో చేరిన వారికి జూన్, జులై జీతాల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బదిలీల ద్వారా ఉత్పన్నమయ్యే జీతాల సమస్య తెలిసి కూడా అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం ఉపాధ్యాయులను ఇక్కట్లకు గురిచేస్తుందన్నారు. జీతాలు లేక అప్పులు తెచ్చి బ్యాంక్‌లో రుణ వాయిదాలు చెల్లిస్తున్నారన్నారు. ఉపాధ్యాయ వర్గానికి అన్ని రకాలుగా మానసిక క్షోభకు గురిచేయడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు రాష్ట్ర కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

పిఆర్‌టియు...

బదిలీలు జరిగి రెండు నెలలైనా ఉపాధ్యాయులకు ఇంత వరకు జీతాలు చెల్లించక పోవడం విద్యా శాఖ తప్పిదమనిపి ఆర్ టి యు రాష్ట్ర అసోసియేట అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ విమర్శించారు. రాష్ట్ర ఖజానాశాఖకు వివరాలు ఇవ్వడానికి ఇంకా ఎంత కాలం తీసుకుంటారన్నారు. రెండు రోజుల్లోగా కేడరు స్ట్రెంత్ సరిచేయుట పోతే పోరాటం తప్పదు అని సూర్య నారాయణ తెలిపారు

సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో సంతృప్తి స్థాయిలో పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చేసిన ప్రభుత్వం తమదేనని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబానికి తన ప్రభుత్వం వల్ల మంచి జరిగితే ఆశీర్వదించాలనే సిఎం జగన్ కోరుతున్నారని చెప్పారు. అయితే అధికారంలోకి వస్తే బట్టలూడదీసి కొడతానని జనసేన అధినేత పవన్ కళ్యాణ్, పాతాళంలోకి తొక్కస్తానని టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు సభల్లో విమర్శలు చేస్తున్నారని చెప్పారు. గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాలతో ప్రతి ఎమ్మెల్యే, మంత్రిని ఇంటింటికీ పంపించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకునేలా చేసిన ఘనత సిఎం జగన్ దేనని అన్నారు. కార్యక్రమాలలో తెలుసుకున్న సమస్యల్ని అక్కడికక్కడే పరిష్కరించే అవకాశం దక్కిందన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి అవసరమైన 11రకాల ధ్రువపత్రాలను పేదలందరికీ పంపిణీ చేయడం ఇదే మొదటిసారని చెప్పారు. నియోజకవర్గంలో ఇంతవరకు రూ.900లక్షలు సంక్షేమ లబ్ది చేకూర్చినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా రూ.850లక్షల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వీటిలో కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని జరుగుతున్నాయని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి విషయంలో టిడిపి నాయకులతో ఎప్పుడైనా చర్చకు సిద్ధమేనని చెప్పారు. గతంలో అనేకసార్లు ఇదే సవాల్ విసిరానని, ప్రతిపక్ష పార్టీ నాయకులు తోక ముడిచారని చెప్పారు.భవిష్యత్ లో నైనా చర్చకు సిద్ధమేనని డిప్యూటీ సీఎం రాజన్నదొర సవాల్ చేశారు.ఈసమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబు,జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

ప్రజాశక్తి - సీతానగరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆయిల్ పామ్ రైతులకు మెరుగైన సేవలు అందించడం వల్ల అధిక దిగుబడులు సాధించి లాభాలు సాధించవచ్చునని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని బగ్గం దొరవలసలో గల శ్రీనివాసా పామాయిల్ నర్సరీ వద్ద గురువారం నిర్వహించిన మెగా పామాయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్దఎత్తున మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పామాయిల్ రైతుల సమావేశంలో పామాయిల్ ప్లాంటేషన్ గూర్చి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమం గూర్చి వివరించారు. గురువారం అన్ని ప్రాంతాల్లో పామాయిల్ ప్లాంటేషన్ పెంప కానికి సంబంధించి పెద్ద ఎత్తున కార్యక్ర మాలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ హార్టికల్చర్ ఆఫీసర్ క్రాంతి,మండల హార్టికల్చర్ ఆఫీసర్ ప్రత్యూష, కంపెనీ ఎండి పి.పాండురంగారావు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ పి.మణిదీప్‌కృష్ణ, ప్లాంటేషన్ మేనేజర్ జి.వీరబాబు, ప్లాంటేషన్ నర్సరీ ఇంచార్జి కె.శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు తిరుపతినాయుడు, నారాయణరావు, కర్రి శ్రీరాములు, రెడ్డి గోపీనాథ్, కర్రి శంకరరావు పామాయిల్ రైతులు కొట్యాడ శంకరరావు, దామినేని సతీష్ తదితర రైతులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పామాయిల్ మొక్కలు అందజేస్తున్న ఉద్యానశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి

తూడి లో ఓటర్ సర్వే పై ఆరా తీస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి

ఇద్దరు బిఎల్ఒలకు షోకాజు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని హుస్సేన్ పురం, తూడి, రేగులపాడు , పనస నందివాడ, బీటివాడ గ్రామాల్లో గురువారం ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి పర్యటించారు. తూడి, హుస్సేన్ పురం గ్రామాల్లో ఓటర్ సర్వేలో లోపాలు ఉన్నాయని గుర్తించి ఇద్దరు బిఎల్ఒలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తహశీల్దారు సిహెచ్ సత్యనారాయణకు ఆదేశించారు. బిటివాడ గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. రేగులపాడు పనస నందివాడ గ్రామాల్లో జగనన్న కాలనీలను పరిశీలించారు.

పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని మున్సిపల్ కమిషనర్ జె. రామఅప్పలనాయుడు ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళి, సచివాలయాల శానిటరీ సెక్రటరీలకు సూచించారు. గురువారం ఆయన స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలోని, బెలగాంలో 16 వార్డులో ఉన్న సాయి నగర్ కాలనీ, 19వ వార్డులో ఉన్న వైకెఎం కాలనీల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను ప్రజారోగ్య అధికారి, సచివాలయాల శానిటరీ సెక్రటరీలతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వర్షాలు పడుతున్న దృష్ట్యా పట్టణంలో అన్ని వార్డుల్లోనూ పారిశుధ్య నిర్వహణ జరుగుతున్న తీరుపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని, పారిశుధ్య కార్మికులు చేస్తున్న ఇంటింటి చెత్త సేకరణతో పాటు, ప్రజలు రోగాల బారిన పడకుండా మురుగు కాలువల్లో దోమలు ప్రబలకుండా పిచికారీ చేయించాలని, రహదారులు శుభ్రం చేసి బ్లీచింగ్ చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జగనన్న సురక్షతో నియోజకవర్గంలో 96 శాతం సమస్యలు పరిష్కారమయ్యాని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు తెలిపారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 76 క్యాంపు నిర్వహించి73,950 కుటుంబాలకు చేరువై 26,823 మంది సర్టిఫికెట్లకు దరఖాస్తులు పెట్టుకోగా 25,591 మందికి సర్టిఫికెట్లు జారీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన వాలంటీర్లు, మండల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ ఛైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపడాలి

ప్రజాశక్తి - సీతంపేట

గ్రామాల్లో పారిశుధ్య మెరుగుపడాలని ఎంపిడిఒ కొండపల్లి సత్యం అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశ నిర్వహించారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని స్ప్రేయింగ్, ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. క్లోరిక్యులేషన్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన పంచాయతీ కార్యాలయాల్లో బ్లీచింగ్ నిల్వలు ఉంచాలని చెప్పారు. గ్రామ వాలంటీర్ల ద్వారా సమాచారం తీసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. గడప గడప వచ్చిన వినతులు, కాపు నేస్తం మిగతా సంక్షేమ పథకాలు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నిమ్మకకు డివిజి పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజును రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డివిజి శంకర్రావు గురువారం పరామర్శించారు. జయరాజుకు మెరుగైన వైద్యం అందించాలని కెజిహెచ్ సూరింటెండెంట్ డాక్టర్.శివానందను కోరామని అన్నారు. అలాగే కెజిహెచ్‌లో ఉన్న ట్రైబల్ సెల్ ను పరిశీలించి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చి చికిత్స పొందుతున్న గిరిజన రోగుల బాగోగులు తెలుసుకున్నారు. వాళ్లందరికీ మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను సంప్రదించానని అన్నారు. ఈయన వెంట ఎస్టీ కమిషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి -భామిని

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం ఆధ్వర్యంలో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీ ల అభివృద్ధిలో భాగంగా మీ పంచాయతీలో చేపట్టాల్సి పనులను ప్రాధాన్యత క్రమంలో తెలిపి వినతిపత్రం అందివ్వాలని, వీటిని ఎంఎల్ఎకు తెలిపి త్వరగా పనులు చేపట్టేందుకు సాధ్యపడుతుందన్నారు. అనంతరం సర్పంచ్లు, ఎంపిటిసిలు పంచాయతీలో చేపట్టాల్సిన పనులపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాద్, పిఎసిఎస్ ఛైర్మన్ గెల్లంకి రమేష్, సర్పంచులు, ఉన్నారు.

'టిడిపితోనే మెరుగైన పాలన'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇరిడిలో టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే టికెట్ ఆశావాహి బిడ్డిక పద్మావతి మాట్లాడుతూ వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో ఏజెన్సీలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను అణగదొక్కారన్నారు. ప్రజా రంజకమైన పథకాలతో టిడిపి మేనిఫెస్టో రూపొందించడం జరిగిందని ప్రజలకు వివరించారు. ప్రజల భవిష్యత్ బాగుండాలంటే 2024 ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి కొండలరావు, గ్రామస్తులు పాల్గొన్నారు

పేద పురోహితులకు ఆసరాగా అర్చక సొసైటీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పేద పురోహితులకు ఆసరాగా పురోహిత, అర్చక సొసైటీ ఉంటుందని ఆ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి రామకృష్ణ, కార్యదర్శి వై. రాంబాబు శాస్త్రి అన్నారు. గురువారం స్థానిక కళింగ వైశ్య కన్యకా పరమేశ్వరి ఆలయంలో పురోహితుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి . ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో పురోహితుల, అర్చకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది టి.జోగారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర అర్చక సొసైటీలో సభ్యులుగా ప్రతి ఒక్క పురోహితులు, అర్చకులు చేరాలని, సభ్యత్వం పొందిన పురోహితులకు పలు రకాల సేవలతో పాటు, నెలకు రూ.2వేలు, వివాహం చేసుకునే వారికి నెలకు రూ.10వేలు అందజేస్తామన్నారు. 18నుంచి 60 ఏళ్ల వారికి జీవిత బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పురోహిత, అర్చక సొసైటీ వైస్ ప్రెసిడెంట్ దేవులపల్లి కామేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ దూళిపాళ్ల మురళి శర్మ, జిల్లా పురోహితులు ఎంఎ సత్యనారాయణ శర్మ, మంతా. రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

గోతులు కూడా పూడ్చలేని చేతకాని ప్రభుత్వం

ప్రజాశక్తి - సీతానగరం

కనీసం రోడ్డు గోతులను కూడా పూడ్చలేని చేతకాని ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని టిడిపి పార్వతీపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర ధ్వజమెత్తారు. స్థానిక పెద్దబోగిలి పంచాయతీ మార్కెట్ లో మెయిన్ రోడ్‌పై గోతులు చెరువు తలపించేలా నీరు ఉన్నప్పటికీ పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో అన్ని రోడ్ల పరిస్థితి ఇలాగే ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కనీసం రోడ్లును కూడా వేయలేని స్థితిలో ఉందని, అరాచకం పెరిగిందని, ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపడం ఖాయమని హెచ్చరించారు.

నియోజకవర్గ కొత్త ఇన్చార్జికు ఘన స్వాగతం

టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన బోనెల విజయచంద్రకు మండల టిడిపి నాయకులు ఎస్.హరిగోపాలరావు, ఆర్.వేణుగోపాల్ నాయుడు. బి.శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికారు. సలహరి గోపాలరావు ఇంటి వద్ద సన్మానిస్తూ పార్టీ ఇచ్చిన బాధ్యతలు సక్రంగా నిర్వహిస్తానని, రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన్ని సన్మానించారు. కార్యక్రమంలో పెదబోగిలి సర్పంచ్ జొన్నల తేరేజమ్మ, మాజీ ఎంపిటిసి సభ్యులు సంభాన శ్రీనివాసరావు, నాయకులు దామినేని భాను ప్రసాద్, ఎం.శంకరరావు, సతీష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డులో ప్రయాణం నరకం

కురుపాం: గుంతల మయమైన రోడ్డులతో గిరిజన ప్రజల ప్రయాణం నరకంలా ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. మండలంలోని గోటివాడ గ్రామంనకు వెళ్లే గుంతల మైన రోడ్డును గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఈ ఆధునిక ప్రపంచంలో కూడా మట్టిరోడ్డుపై రాకపోకలు సాగించడం చాలా బాధాకరమని వర్షం పడితే నడవడానికి కూడా కష్టంగా ఉంటుదని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటిది అత్యవసర పరిస్థితుల్లో రోగిని మూడు కిలోమీటర్లు మోసుకొని మెయిన్ రోడ్డుకు తీసుకువచ్చి 108 వాహనానికి ఎక్కించే సంఘటనలు ఎన్నో ఉన్నాయని అన్నారు.

భామిని : గుంతులమయైన బత్తిలి-అతికాం రోడ్డుపై నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

సీతానగరం : పెదబోగిలిలోచెరువును తలపిస్తున్న ప్రధాన రహదారిని చూపుతున్న టిడిపి నాయకులు

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిటి రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలూరు శ్రీను, గ్రామస్తులు నిమ్మక అప్పారావు, ప్రసాద్, కైలాసు, రాజు, సంతు, బాల, ఆదమ్మ పాల్గొన్నారు.

భామిని : మండలంలోని సింగిడి సమీపంలోని ప్రధాన రహదారి బత్తిలి -అలికాం రోడ్డుపై నీటితో నిండిన గుంటలులో వరి నాట్లు నాటుతూ, రోడ్డు దుస్థితి పై పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ నిమ్మక. జయకష్ణ నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు ఇంత దారుణంగా ఉండి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురి అయ్యి, ప్రజలు రోడ్డు ప్రమాదాలు గురి అవుతుంటే స్థానిక ఎమ్మెల్యేకు పట్టదానని ప్రశ్నించారు. అనంతరం భామిని ఎగువ భాగం లో ఇతంగూడ సమీపంలో అర్ధాంతరంగా నిలిచిన కొండ లోయ గెడ్డ రిజర్వాయర్ , వడ్డీంగి వద్ద గజపతి సాగరం ను పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి మెడిబోయన జగదీశ్వరరావు, అంపిలి కేశవ, బిడ్డికి ప్రసాద్, లోపింటి రాజేష్, సాకేటి రామారావు, కోరాడ రాజేష్, భూపతి ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిహెచ్‌డబ్ల్యుఒలనుద్దేశించి మాట్లాడుతున్న శ్రామికమహిళా సంఘం నాయకులు ఇందిర

సిహెచ్‌డబ్ల్యుఒల బకాయివేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - బెలగాం

జిల్లాలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు నాలుగు నెలలుగా బకాయి ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ బకాయి వేతనాలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు కే బందావతి, అరుణ, అనిత, మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆరోగ్య సేవలందిస్తూ విధులు నిర్వహిస్తున్నామని, తమకు ప్రతినెలా వేతనాలు ఇవ్వాలని, ఆశాలుగా గుర్తించాలి, గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇవ్వాలని, ఉపాధి భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కార్యదర్శి ఎన్‌వై నాయుడు, నాయకులు బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా సబ్ జైలులో రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విశాఖ, శ్రీకాకుళం జిల్లాల సబ్ జైలు అధికారి బి.కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపై ఆరా తీశారు. అలాగే వారికి అందిస్తున్న మెనూను పరిశీలించి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రిమాండ్ ఖైదీలు ఉంటున్న గదులు శుభ్రత పాటించాలని అన్నారు. ముఖ్యంగా మరుగు దొడ్లు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులుకు ఆదేశించారు. ఖైదీలకు కాచి చల్లార్చి నీటిని తాగాలని అన్నారు. అలాగే ముఖ్యంగా ఐ ఇన్ఫెక్షన్ చాలా ఎక్కువగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికను, గేటు రికార్డులు, స్టాక్ రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌సి పి.చంద్ర రావు, పి.మధు, హేమసుందర్, ఎస్.శ్రీనివాసరావు తదితర సిబ్బంది ఉన్నారు.

నిశితంగా పరిశీలించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఓటరు గుర్తింపు నిశితంగా పరిశీలించాలని సహాయక ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిహెచ్ సత్యనారాయణ బిఎల్ఒలకు ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బిఎల్ఒలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఇంటికి డోర్ నెంబర్లు పరిశీలించడంతో పాటు ఓటరు గుర్తింపును కూడా పరిశీలించాలన్నారు. మరణాలు, శాశ్వతవలసలు, వివాహాలకు, డబల్ ఎంట్రీలు వంటివి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్తు ఎఒ వై.వెంకటరమణ, ఎంఇఒ ఆర్.ఆనందరావు, ఆర్ఐ మారుతీరావుతో పాటు బిఎల్వోలు పాల్గొన్నారు

10న డీ వార్మింగ్

ప్రజాశక్తి-పాలకొండ రూరల్, వీరఘట్టం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం, ప్రాంతీయ ఆసుపత్రులను గురువారం సందర్శించారు. నీలమ్మకాలనీ ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. జ్వర లక్షణాలతో ఎవరు వచ్చినా వెంటనే పరీక్షలు జరిపి, తగు చికిత్స ఇవ్వాలన్నారు. ఈనెల 10న జరగబోయే డీ వార్మింగ్ డే (నులి పురుగులు నివారణ కార్యక్రమం) కు ముందస్తు కార్య కారణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో డెంగీ లక్షణాలతో ఉన్న రోగులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆసుపత్రి సూపరిండెంట్, గైనకాలజిస్ట్ లతో సమావేశమై సీజనల్ వ్యాధులు, ప్రసవాలపై సమీక్ష జరిపారు. అనంతరం రేగులపాడులో కెజిబివి పాఠశాలను సందర్శించి వైద్య సిబ్బంది నిర్వహించిన హిమోగ్లోబిన్ పరీక్షలు, వాటి గణాంకాలను పరిశీలించారు. రక్తహీనత గుర్తించిన విద్యార్థులకు ప్రతిరోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ వేయించాలన్నారు. అనంతరం తంపటాపల్లి లో అంగన్వాడీ కేంద్రం, వెల్నెస్ కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రజా సంక్షేమ ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం పి రాజన్న దొర అన్నారు. పాచిపెంటలో గురువారం కొనసాగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఆయన ఇంటింటికి వెళ్లి గత నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. సమస్యలుంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మీసాల నారాయణ, ఎంపిడిఒ జి.పార్వతి, తహశీల్దార్ ఆర్.రాజశేఖర్, వైసిపి నాయకులు డి.బాబ్జీ, టి గౌరీశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మానాపురాన్ని సందర్శించిన డిఎంఒ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని టీటికిపాయి సచివాలయం పరిధిలో ఉన్న మానాపురం గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి శ్యాం కుమార్ సందర్శించారు. స్ప్రేయింగ్ పిచికారిని పరిశీలించారు. ఇంటింటా స్ప్రేయింగ్ చేయాలన్నారు. జ్వరాలపై ఆరా తీశారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి మోహన్ రావు ఎమ్ టి ఎస్ ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి రెండో విడత కౌన్సిలింగ్

ప్రజాశక్తి-సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశానికి రెండో విడత కౌన్సిలింగ్‌ను గురువారం ఎపిఒ వై.రోషిరెడ్డి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ మెరిట్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తామని చెప్పారు. 522 మంది దరఖాస్తు చేయగా 288 కౌన్సిలింగ్ కి హాజరయ్యారని, 97 ఖాళీలు భర్తీ చేశామని తెలిపారు. కౌన్సిలింగ్‌లో ప్రిన్సిపాల్ ఎం. గోపాలకృష్ణ సూపరింటెండెంట్ పాల్గొన్నారు

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పాచిపెంట

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు రక్తహీనత సమస్య తొలగిపోయి సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గురువారం వైయస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన గర్భిణీలకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పౌష్టికాహారలేమి సమస్య వల్ల రక్తహీనతకు గురై వ్యాధి నిరోధక శక్తి తగ్గి మృత్యువాత పడుతున్నారని, ఇకపై గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు రక్తహీనతతో బాధపడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో వైయస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్, టేక్ హోమ్ రేషన్ కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒ బి.అనంతలక్ష్మి, ఎంపిడిఒ జి.పార్వతి, వైస్ ఎంపిపి మీసాల నారాయణ, ఎంఇఒ జోగారావు, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార కిట్లను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పాలకొండ రూరల్: మండలంలోని బుక్కురు 1, 2 అంగన్వాడి కేంద్రాల్లో సర్పంచ్ బి.కొండలరావు చేతులు మీదుగా గర్భిణి, బాలింతలకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎచ్ పి.కమలాజోషీ, టి.దివ్య, హిమాప్రభ గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గర్భిణులు, బాలింతలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ తాడికొండ సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. కొండవాడ పంచాయతీ వత్తాడలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సంపూర్ణ పోషణ కిట్లను అందించారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతాలను నిర్వహించారు.

కురుపాం : స్థానిక మండల కేంద్రంలో గల అంగన్వాడీ కేంద్రం -3 లో జరిగినటేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిపి శెట్టి పద్మావతి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణీలకు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వి.వి. రవణమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు జె.సరోజ, సూర్యకుమారి, శోభ, రాధా కుమారి సరస్వతి పాల్గొన్నారు.

ఇళ్ల పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారి దివాన్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

జగనన్న లేఅవుట్లను పరిశీలించిన రాష్ట్ర అధికారి దివాన్

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న లేఅవుట్ లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ రాష్ట్ర అధికారి ఎం.కె.దివాన్ ఆదేశించారు. గురువారం ఆయన పట్టణంలోని నెలిపర్తి లేఅవుట్ -2, గుమడాం లేఅవుట్ -5లను పరిశీలించారు. నెలిపర్తి లేఅవుట్‌ను పరిశీలించిన సమయంలో లబ్దిదారులు కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన రహదారిని కలుపుతూ కాలనీ రహదారి ని నిర్మించాలని కోరారు. గుమడాం లేఅవుట్ లో చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టరు నెలిపర్తి లేఅవుట్ పనులు ప్రారంభించలేదని చెప్పారు. అనంతరం గుమడాం లేఅవుట్ ని పరిశీలించి ఇళ్ళ నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట హౌసింగ్ పిడి ఈ.శ్రీనివాసరావు , అర్బన్ ఎఇ టి.శ్రీనివాసరావు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఎ పిఒ సి. విష్ణు చరణ్ అన్నారు. మండలంలోని పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలో లభ్యంగా ఉన్న మందులు, సౌకర్యాలను పరిశీలించారు. చికిత్స పొందుతున్న వ్యక్తులతో మాట్లాడుతూ అందుతున్న వైద్య సేవలు పట్ల ఆరా తీశారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వర్షా కాలం ప్రారంభమైందని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ కేసులు లేకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దోమ తెరలు వినియోగం పట్ల దృష్టి సారించాలన్నారు. ఫ్యామిలి డాక్టర్ సందర్శనలు పక్కాగా జరగాలన్నారు. సిడి, ఎన్‌సిడి సర్వే నిర్వహణలో ప్రజల జీవన విధానం, ఏర్పడుతున్న సమస్యలు వివరించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం ప్రాధాన్యతతో పరిశీలించాలని, హైరిస్క్ గర్భిణీలుంటే ముందస్తు సూచనలు చేయాలని అన్నారు. మాతా శిశు మరణాలు ఎక్కడా సంభవించ రాదని ప్రాజెక్టు అధికారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లిలో విత్తనోత్పత్తి శిక్షణ కార్యక్రమం నిర్వహించడమైంది. ఈ శిక్షణలో జిల్లా రిసోర్స్ కేంద్రం ఎడిఎ శారద రైతులకు నారుమడిలో కలుపు యాజమాన్యం, అలాగే వరి విత్తన ఉత్పత్తుల మెలకువలను, నివారణ చర్యలు గురించి వివరించారు. శిక్షణలో సూచనలు, సలహాలు పాటించినట్లయితే వ్యవసాయంలో అధిక దిగుబడులను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కురుపాం డివిజన్ ఎడిఎ నిర్మల జ్యోతి, వ్యవసాయ అధికారిని, స్థానిక సర్పంచ్, విఎఎలు మరియు రైతులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌గా శంకరరావు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) ప్రిన్సిపల్‌గా పైల శంకర్రావును నియమిస్తూ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రాజమహేంద్రవరం వారు ఆదేశాలు జారీ చేశారు. ఇంతవరకు ప్రిన్సిపల్‌గా పనిచేసిన కుమారస్వామి వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లిన కారణంగా ఏర్పడిన ఖాళీలో పైల శంకర్రావుకు పూర్తి అదనపు బాధ్యతలతో ప్రిన్సిపల్ గా నియమించారు. ఈయన ఇంతకు పూర్వం వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గానూ, స్థానిక బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గానూ బాధ్యతలు నిర్వహించారు.. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో వాణిజ్యశాస్త్రం అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు.

కాలువ గండి పూడ్చివేత

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం పరిధిలోనే 5వ బ్రాంచ్ పిల్ల కాలువ గండిని గురువారం నీటిపారుదల శాఖ అధికారులు పూడ్చారు. పిల్ల కాలువకు గండిపై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి సిమెంట్ సంచుల్లో ఇసుకను వేసి గండిని పూడ్చారు.

బీమా సాయం అందజేత

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణానికి చెందిన కిల్లారి సుగుణాకం రావు నాయుడు బుధవారం మృతి చెందగా ఆయన భార్య స్వాతికి జగన్న భీమా పథకంలో భాగంగా రూ.10వేలు నగదును గురువారం అందించారు. కార్యక్రమంలో 17వ వార్డ్ కౌన్సిలర్ దుప్పాడ పాపి నాయుడు, అంపిలి సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు, సచివాలయ సిబ్బంది రాజేశ్వరి పాల్గొన్నారు.

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని సుభద్రలో మద్యం సీసాలు పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై ఎన్ ప్రసాద్ కుమార్ తెలిపారు. అంబటి సాంబమూర్తి అనే వ్యక్తి వద్ద 18 మద్యం సీసాలు పట్టుకున్నామని, వీటి విలువ రూ.2,700 ఉన్నట్లు ఆయన తెలిపారు .

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి - బెలగాం

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించడం ద్వారా రక్తహీనత ఉన్న వారిని త్వరగా గుర్తించి, నివారణ చర్యలు చేపట్టవచ్చని జిల్లా ఇమ్యుజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది నిర్వహించిన హిమోగ్లోబిన్ పరీక్షలను గురువారం ఆయన పరిశీలించారు. రక్త పరీక్షల గణాంకాలను పరిశీలించి విద్యార్థుల హిమోగ్లోబిన్ శాతాన్ని బట్టి మైల్డ్, మోడరేట్, సివియర్ గా విభజించి నమోదు చేయాలన్నారు. ఎనిమిది కంటే తక్కువ శాతం ఉన్న విద్యార్థుల జాబితాను సిద్ధం చేసి వైద్య, కళాశాల సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని, ప్రతిరోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలని, అలాగే హిమోగ్లోబిన్ శాతం సాధారణంగా ఉన్న వారికి వారానికి ఒక మాత్ర చొప్పున వేయించాలని సూచించారు. కిశోర బాలికల్లో రక్తహీనత నివారణపై మరింత శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం విద్యార్థులుకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె.రామారావు, సూపర్ వైజర్లు పుష్ప, జయగౌడ్, ఎన్ఎస్ఎస్ పిఒలు తవిటినాయుడు, రవికుమార్, శ్రీనివాసరావు, ఎఎన్ఎం నారాయణమ్మ, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఇటీవల కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంచాన ఉమా మహేశ్వరరావు, పాకల సన్యాసిరావు మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడుతో అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు వినతిని అందించారు. అనంతరం కమిషనర్‌తో మాట్లాడుతూ కరోనా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వ్యాధులు సోకకముందే ముందస్తుగా దోమల నివారణా చర్యలు చేపట్టాలని, కాలువల్లో మురుగులేకుండా చేయాలని, రోడ్లపై మురుగునీరు నిల్వ లేకుండా చేయాలని, పరిశుభ్రమైన మంచినీరు ఇవ్వాలని, వీధిల్లోనూ, ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు, తుప్పలు తొలగించాలని, హోటళ్లను పరిశుభ్రంగా ఉంచేలా చేయించి, తాగేందుకు మంచినీరు ఏర్పాట్లు చేయాలని,ప్రజలందరికీ అహగాహన కల్పించాలని, కల్తీ ఆహార దినసరుకులపై చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో నేరడుబిల్లి గౌరి, హనుమంతు శ్రీను, అలెక్స్ పాండి, జవ్వాది పోలి, సుంకరి లక్ష్మణరావు, కొత్తగుండు గణేష్ పాల్గొన్నారు.

సాగునీటి వనరులపై ఇంత నిర్లక్ష్యమా?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రైతు సంక్షేమ ప్రభుత్వంగా గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం ఏజెన్సీలో సాగునీటి వనరులపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం విచారకరమని అరకు పార్లమెంట్ టిడిపి ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు అన్నారు. మండలంలోని పలు సాగునీటి చెక్ డ్యాములను గురువారం పరిశీలించారు. కొత్తగూడ గ్రామ సమీపాన ఉన్న చెక్ డ్యాము పూర్తిగా పిచ్చి మొక్కలతో పేరుకు పోయి, శిథిలమై ఉండడాన్ని గుర్తించారు. ఇలా అయితే సాగునీరు ఎలా అందుతుందని ప్రశ్నించారు. అనంతరం డుమ్మంగిలో ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. గిరిజన సంక్షేమం ఉపాధి కోసం ఏర్పాటుచేసిన చేపల ఉత్పత్తి కేంద్రం మరుగున పడడం దారుణమన్నారు. జులై నెల వచ్చినా చేప పిల్లల ఉత్పత్తి ప్రారంభించకపోవడంతో గిరిజనులకు ఉపాధి ఏ విధంగా అందుతుందని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి ఈ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మండంగి భూషణ ఉన్నారు.